# మారిన మనుషులు

"పాపా! ఒక గ్లాసు మంచినీళ్ళు తెచ్చి పెట్టమ్మా!" సమాధానం లేదు. "బాబీ! కనీసం నువ్వయినా తెచ్చిపెట్టరా!" 2, 3 సార్లు కేక పెట్టినా ఎలాంటి సమాధానమూ లేదు. అందరూ టీవీ సీరియల్ చూడటంలో మునిగి పోయారు. మళ్ళీ రెండు మూడుసార్లు పిలిచినా లాభం లేకపోవడంతో మౌనంగా ఉండిపోయాడు వెంకట్రావు. వాళ్ళు వినలేదో, విననట్టు నటిస్తున్నారో ఆయనకు అర్థం కాలేదు. వెంకట్రావు ఎన్నిసార్లు పిలిచినా వినిపించుకోనట్టు ఉండటం ఇంట్లో వాళ్ళకు అలవాటే.

ఇంట్లో అందరికన్నా ముందే ఆయన నిద్రలేచేవాడు. అయినా మంచంపై అలా ఊరికే పడుకునేవాడే తప్ప లేచి తిరిగే ధైర్యం చేయ



లేకపోయేవాడు. కోడలికి ఎక్కడ నిద్రాభంగం అవుతుందోనని భయపడేవాడు.

ఆయన భార్య సీత ఉన్నన్ని రోజులూ అతను లేవగానే వేడిగా కాఫీ తెచ్చి ఇచ్చేది. కాఫీ తాగుతూ పేపర్ చదివేవాడు. తన భర్తకున్న ఈ అలవాటు గురించి కోడలికి చెప్పింది. మొదట్లో శైలజ అన్నీ టైంకి చేసినా అత్తగారు పోయిన తర్వాత ఆమె ప్రవర్తనలో ఎంతో మార్పు వచ్చింది. వయసుతోపాటు చూపు మందగించడంతో పేపరు చదవలేకపోయినా కోడలు ఎప్పుడెప్పుడు కాఫీ గ్లాసు తెచ్చి చేతిలో పెడుతుందా? అని చూసేవాడు వెంకట్రావు. క్రమంగా కాఫీ తాగే టైము 5 గంటల నుంచి 8 గంటలకు మారిపోయింది. శైలజకు బుద్ధి పుడితే ఆరింటికే ఇచ్చేది. లేకపోతే లేదు. ఓరోజు శైలజను కాఫీ అడుగుతుంటే కొడుకు శేఖర్ విని "నాన్నగారూ! మీకు కాఫీకి అంత తొందరెందుకు? అయినా మీరు ఇంట్లోనే ఉండేటప్పుడు అంత పెందరాడే లేవకపోతే కాసేపు పడుకోరాదూ" అని చికాకుపడ్డాడు. "మరేం లేదురా! ఎన్నో ఏళ్ళ నుంచి వస్తున్న అలవాటు. గంట కొట్టినట్లు 4 గంటలకే మెలకువ వస్తుంది. అయినా ఎందుకలా అడుగుతున్నావు?"

"మరేం లేదు. ఉదయం పూట ఊపిరి సలపని పని ఉంటుంది. శైలజ ఒక్కర్తే పని చేసుకోవాలి కదా. మీరు కాఫీ కోసం కాసేపు ఆగలేరా?" అనడిగాడు.

'నిజమే! శేఖర్ చెప్పిన దానిలో తప్పేముంది? తాను కోడలి వైపు నుంచి ఆలోచిస్తేనే కానీ అర్థం కాదు. నాకే కళ్ళు సరిగా కనిపిస్తే కాఫీ నేనే చేసుకునేవాడిని కదా' అని మనసులోనే నొచ్చుకున్నాడు. కోడలు తన దగ్గర కూర్చొని ఆప్యాయంగా కబుర్లు చెపుతుంటే వినాలని, ఆమెకు కష్టాలు చెప్పాలని, ఆమె కోడలిగా కాక కూతురిలా తనతో మాట్లాడాలనీ ఆయన ఆశించేవాడు.

రోజంతా వెంకట్రావు ఒంటరిగా గడపాల్సి వచ్చేది. అలాంటప్పుడు భార్య సీత గుర్తుకు వచ్చేది. ఆమె ఉన్నప్పుడు మధ్యాహ్నం భోజనాలవగానే ఇద్దరూ వరండాలో కూర్చునేవారు. ఆయన పడకకుర్చీలో పడుకుని పేపరు చదువుతుంటే ఆవిడ పక్కనే కూర్చొని బియ్యం ఏరుకోవడమో, పప్పులు బాగుచేసుకోవడమో చేసేది. ఇద్దరూ కబుర్లు చెప్పుకునేవారు. అప్పట్లో వచ్చిపోయేవాళ్ళు కూడా ఎక్కువే. ఆమె పోయినప్పటి నుంచీ రోజులు భారంగా గడవసాగాయి. ఎవరైనా తెలిసిన వాళ్ళు కనిపిస్తారేమోనని ఆశగా వీధికేసి చూసేవాడు. పిల్లలు స్కూలు నుంచి రాగానే ప్రేమగా దగ్గరకు తీసుకుని "ఇవ్వాళ స్కూల్లో ఏం చెప్పా"రని అడిగేవాడు. ఆయన ప్రశ్నకు సమాధానం చెప్పే ఓపిక వాళ్ళకుండేది కాదు. "బోలెడు హోంవర్కు ఇచ్చారు తాతయ్యా మేమెళ్ళి చేసుకుంటాం" అని తుర్రుమనేవారు.

ఆయనకు కంటిచూపుతో పాటు వినికిడి శక్తి కూడా తగ్గిపోవడంతో గట్టిగా అరిచి మాట్లాడే ఓపిక ఇంట్లో వాళ్ళకు వుండేది కాదు. అందుకే ఆయన నుంచి ఎలా తప్పించుకోవాలా అని చూసేవారు. ఆయన మాత్రం కనీసం పిల్లలైనా తనతో ప్రేమగా కబుర్లు చెప్పాలని ఆశించేవాడు. దేశంలో ఏం జరుగుతోంది, ప్రభుత్వం ఏమంటోంది, ప్రతిపక్షం ఏం చురక వేస్తోందో తెలుసుకోవాలని ఆసక్తి చూపేవాడు. ఎవరైనా పేపరు చదివి వినిపిస్తే బాగుండునని అనుకునేవాడు. ఏదైనా ఉత్తరం వచ్చినా, ఇంట్లో ఏదైనా కార్యక్రమం జరుగుతోందన్నా ఎలా

జరుగుతుందో తెలుసుకుని సలహాలివ్వాలని తాపత్రయపడేవాడు. వాళ్ళకు ఏదైనా సాయం చేయాలని ఆరాటపడేవాడు.

అది చూసి శేఖర్ "మీకెందుకు నాన్నగారూ ఇవన్నీ. హాయిగా కృష్ణా రామా అనుకుంటూ కూర్చోక" అని కోప్పడేవాడు.

"నాకర్థం కాదు... ఈవయసులో మామయ్య గారికి ఎందుకింత తాపత్రయం? ఇప్పటికీ తన పెత్తనమే కొనసాగాలని చూస్తుంటారు" అని కోడలు అన్నమాటలు అతని గుండెని పిండే శాయి. ఎంతో కుమిలిపోయాడు. వయసయి పోయిందంటే ఓమూల కూర్చొని చావు కోసం ఎదురుచూడమనా అర్థం? అని బాధపడేవాడు. ఆ ముసలి మనసు బాధని, ఆయన కోరుకునే ప్రేమాభిమానాలనీ ఎవరూ అర్థం చేసుకోలేక పోయేవారు.

లెటర్లు డ్రాఫ్టింగ్ చేయడంలో వెంకట్రావు కు మంచి పేరుంది. ఓరోజు సాయంత్రం పాప ఆయన దగ్గరకు వచ్చి "తాతగారూ! మీరు లెటర్లు చక్కగా డ్రాఫ్టింగ్ చేస్తారని నాన్నగారు ఎప్పుడూ చెపుతుంటారు. అప్పట్లో వైస్రాయ్ మిమ్మల్ని మెచ్చుకుని ప్రశంసా పత్రం ఇచ్చారట నిజమేనా?" అని అడిగింది.

ఆ మాట వినగానే ఆయన ఉబ్బితబ్బిబ్బ య్యాడు. అంటే కొడుకు అప్పుడప్పుడూ నన్ను మెచ్చుకుంటున్నాడన్న మాట. తాను పనికిమా లిన వాడిని అన్న భావం వాడికి లేదన్నమాట అని లోలోపలే ఆనందపడిపోయాడు. "తాత గారూ! నాకు ఉత్తరం ఎలా వ్రాయాలో నేర్పు తారా? రేపు మా స్కూల్లో పోటీ వుంది. అందు లో నేనే ఫస్టు రావాలి" అంది పాప.

ఆ మాట వినగానే ఆయన లేని ఉత్సాహాన్ని తెచ్చుకుని "సరే వెళ్ళి పుస్తకం, పెన్ను తీసుకురా ఇప్పుడే నేర్పుతాను" అన్నాడు.

## వై.కె. మూర్తి

మొత్తానికి ఎలాగో కష్టపడి ఆమెకు లెటర్ రైటింగ్ నేర్పాడు. ఇక ఆ రోజు నుండి పోటీ ఫలితాలు ఎప్పుడొస్తాయా అని ఆరాటంగా ఎదురు చూడసాగాడు. పాప ఇంటికి రాగానే అడిగేవాడు. చివరికి ఓరోజు "వస్తే నీకు తప్ప కుండా చెపుతానులే తాతయ్యా! ఊరికే విసిగిం చకు" అని విసుక్కుంది.

సరిగ్గా ఓ వారం తర్వాత ఓ రోజు మధ్యా హ్నం ఓ షీల్డు తీసుకుని పరిగెత్తుకుంటూ ఆయ న దగ్గరకు వచ్చి "తాతయ్యా! లెటర్ రైటింగ్‌లో నాకే మొదటి బహుమతి వచ్చింది. చూడండి. ఇదంతా మీ వల్లే" అని ప్రేమగా ఆయన్ను హత్తుకుపోయింది. అంతేకాక ఆయనకు స్వీటు తినిపించింది. ఆ రోజు ఆయనకు ఎంతో తృప్తి గా అనిపించింది. పిల్లలనుంచి తాను ఆశిం చిన ప్రేమాభిమానాలు లభించాయి. అయితే చాలా అరుదుగా ఇలాంటి సంఘటనలు జరి గేవి.

ఒకప్పుడు కొత్త ప్రదేశాలను చూడడమంటే అతనికి ఎంతో ఆసక్తి ఉండేది. పచ్చని చెట్లు, పారే సెలయేళ్ళు వంటి వాటిని చూసినప్పుడు అతను మానసికానందాన్ని పొందేవాడు. ప్రతి ఏడాదీ బడ్జెట్టు వేసేటప్పుడు ఆ ఏడాది వేసవి సెలవుల్లో ఎక్కడికి వెళ్ళాలి? ఎప్పుడు వెళ్ళాలి? ముందుగానే నిర్ణయించుకుని దానికి తగిన సొమ్ము కేటాయించేవాడు. ఇలాంటి చిన్నచిన్న విహారయాత్రలు వాళ్ళకు ఉల్లాసాన్ని కలిగిం చేవి.

ఇప్పుడు కూడా కొడుకు, కోడలు, మన వళ్ళు, మనవరాళ్ళు... ఇలా అందరితో కలిసి బయటకు వెళ్ళడం ఆయనకు ఇష్టం. నా కొడు కు నన్ను ఎంత ప్రేమగా చూసుకుంటున్నాడో

అని అందరికీ గర్వంగా చెప్పుకోవాలని ఆయన ఆరాటపడేవాడు. కానీ అంత ఓపికగా ఆయనను తీసుకెళ్ళేవారెవరు? ఓసారి బయటికి తీసుకెళ్ళారు. అప్పుడు కోడలు కొడుకుతో అన్న మాటలు తనకింకా గుర్తున్నాయి. "ఏంటండీ మీరు ఆయనను ఎందుకు రమ్మన్నారు? ఆయన వుంటే నాకెంత ఇబ్బందిగా వుంటుందో తెలుసా? హాయిగా తిరగలేను, తినలేను, కూర్చోలేను" అంది. దానికి కొడుకు "ఏదో మాట వరసకు రమ్మంటే ఇలా వచ్చేస్తారని నాకు మాత్రం ఏం తెలుసు?" అన్నాడు. ఇది విన్న వెంకట్రావు నివ్వెరపోయాడు. అంటే తను నిజంగా రావాలని వాళ్ళకు లేదన్నమాట. ఇక ఆ రోజు నుండి వాళ్ళు ఎప్పుడు బయటికి వెళదాం రమ్మన్నా నాకు ఒంట్లో బాగాలేదని తప్పించుకునేవాడు. లోలోపల వెళితే బావుండునని అనిపించినా ఆయన గాంభీర్యం వెనుక వున్న పసి మనసును ఎవరూ అర్థం చేసుకోలేకపోయారు.

ఇంట్లో రకరకాల పిండివంటలు చేయాలని ఆశపడేవాడు. వర్షాకాలం, చలికాలం వచ్చిందంటే చాలు సీత ఉల్లిపాయ పకోడీలు, గారెలు, బజ్జీలు వేడివేడిగా చేసి పెట్టేది. ఆమె చేతి వంట ఎంతో అద్భుతంగా వుండేది. ఎంతో ఆప్యాయంగా కొసరికొసరి వడ్డించేది. ఆమె గుర్తొచ్చినప్పుడల్లా ఆయన కళ్ళు చెమర్చేవి. కానీ ఇప్పుడు పండుగలలో పిండివంటల రుచి చూడడం మహా కష్టమయింది.

ఇలాగే ఓరోజు బెంగగా కూర్చుని ఉండగా ఛాతీలో నొప్పిగా అనిపించి, పక్కనేవున్న గంట కొడుతూనే నేలపై ఒరిగిపోయాడు. శైలజ సణుక్కుంటూ "ఒకసారి కొడితే చాలు కదా! ఎందుకలా చెవులు చిల్లులు పడేలా గంట కొడతారు?" అంటూ గదిలోకి అడుగుపెట్టింది.

ఆయన నేలపై స్పృహతప్పి పడివుండటం చూసి కంగారుగా "మామయ్యగారూ... మామయ్యగారూ...!" అన్నా ఉలుకూపలుకూలేదు. వెంటనే శేఖర్‌కు ఫోన్ చేసింది. అతను కంగారుగా అంబులెన్స్‌ని పిలిపించి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్ళాడు.


ఆయనకు హార్ట్ ఎటాక్ వచ్చింది. పెద్ద వయసు కాబట్టి ఓ పదిరోజులు ఆస్పత్రిలో వుంటే మంచిది అని డాక్టర్లు చెప్పారు. శేఖర్ సరేనని చెప్పడంతో వెంకట్రావుని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వుంచారు.

వెంకట్రావు ఆస్పత్రిలో చేరి అప్పటికి వారం కావస్తోంది. ఇల్లంతా బోసిపోయినట్లుగా వుంది. ఇంట్లోవాళ్ళకు ఏమిటోలా అనిపించసాగింది. ఏడు రోజులు ఏడు యుగాలనిపించాయి. మాటిమాటికీ పిలిచి సతాయించేవాళ్ళు లేకపోవడం అటు శైలజకు కానీ, ఇటు పిల్లలకు కానీ ఏమీ తోచడంలేదు. వరండాలో ఆయన కూర్చునే పడకకుర్చీ బోసిగా చూస్తోంది. పిల్లలు వస్తూ పోతూ ఆ కుర్చీకేసి చూసేవారు. రోజూ వాళ్ళు స్కూలు నుంచి వచ్చేసరికి వెంకట్రావు ఆ కుర్చీలో కూర్చొని స్కూల్లో ఏం జరిగిందని ఓపికగా అడిగేవాడు. వెళ్ళేటప్పుడు "టిఫిన్ తిన్నావా? రోడ్డు జాగ్రత్తగా దాటండి" అని ఎన్నో జాగ్రత్తలు చెప్పేవాడు. ఇవన్నీ వాళ్ళ కళ్ళ ముందు మెదులుతున్నాయి. ఓ రెండు కళ్ళు ఎప్పుడూ తమని ప్రేమగా వెంటాడుతున్నట్లు వాళ్ళకు అనిపించేది.

హాస్పటల్‌లో నిస్తేజంగా పడివున్న ఆయనను చూసినప్పుడల్లా వాళ్ళ మనసు వికలమయ్యేది. పాప అయితే ఆస్పత్రిలోనే ఏడ్చేసింది.

తాము ఎంత విసుక్కున్నా ఎంతో ప్రేమగా

'చదరంగం' ఆటని భారతీయులే కనిపెట్టారు.




చూసేవాడు. ఒకటికి రెండుసార్లు పిలిస్తే చిరాకు పడేవాళ్ళు. 'ఎంత తప్పుచేశాము, ఇక నుంచి తాతయ్యను ప్రేమగా చూసుకోవాలి' అని బాబీ, పాప నిశ్చయించుకున్నారు. శైలజకు కూడా వెంకట్రావు లేనిలోటు స్పష్టంగా తెలుస్తోంది. 'అమ్మాయ్' అని ప్రేమగా పిలిచే వ్యక్తి లేకపోవడం ఏదో బెంగగా వుంది. ఆయన డిశ్చార్జి అయి ఎప్పుడెప్పుడింటికి వస్తారా అని ఆరాటంగా ఎదురుచూడసాగింది.

శేఖర్ పరిస్థితి కూడా ఇంచుమించు ఇదే. తండ్రి పట్ల తాను ప్రవర్తించిన తీరుని తలచుకుని కుమిలిపోయాడు. చివరికి తన కారణంగా ఎంతో ఆరోగ్యంగా వుండే తండ్రి మంచం పట్టాడు.

రోజూ ఆఫీసు నుంచి రాగానే "ఎలా వున్నారు? భోంచేశారా" అని మొక్కుబడిగా అడగడం తప్పితే ప్రేమగా ఎప్పుడూ ఒక మాట కూడా మాట్లాడలేదు. భార్యతో, పిల్లలతో, స్నేహితులతో గడపడానికి తీరిక వుంటుంది కానీ తండ్రితో ఆప్యాయంగా ఒక్క మాట మాట్లాడటానికి తీరిక లేదు. ఒంటరిగా గడపడం ఎంత కష్టమో తనకిప్పుడు అర్థమయింది.

తల్లి ఉన్నప్పుడు వాళ్ళిద్దరూ చక్కగా కబుర్లు చెప్పుకునేవారు. అలాంటిది ఆమె పోయిన తర్వాత ఆయనను ప్రేమగా పలకరించేవారు లేకపోయారు. కొడుకుగా ఆయనకు వేళకు తిండి పెట్టడం, జబ్బు చేస్తే డాక్టరుకు చూపించడం లాంటి బాధ్యతలు తాను చక్కగా నిర్వహిస్తూనే వున్నా తన ప్రవర్తనపై అతనికి విరక్తి పుట్టింది.

మామగారు లేకపోవడంతో శైలజ ఒంటరితనం ఫీల్ అవుతోంది. ఆ ఒక్క ముసలి ప్రాణి లేనంత మాత్రాన ఇల్లు చిన్నబోతుందని ఆమె కనీసం కలలోనైనా ఊహించలేదు. ఆయన ఉన్నప్పుడు ఎక్కడికెళ్ళాలన్నా నిశ్చింతగా వెళ్ళేది. అదే ఇప్పుడు కనీసం అగ్గిపెట్టె తెచ్చుకో

వాలన్నా ఇంటికి తాళం పెట్టుకుని వెళ్ళాల్సి వస్తోంది.

'ఆయనకు రెండు పూటలా గుప్పెడు మెతుకులు పడేస్తే చాలని మాత్రమే తాను అనుకునేది. ఒక్క రోజైనా ప్రేమగా రెండు మాటలు మాట్లాడలేదు. కోడలిగా తన కర్తవ్యం ఇదేనా? సేవ చేయడమంటే ఇలాగేనా? తాను ఎంత తప్పు చేసింది? ఎదుటివారిని ప్రేమగా, ఆప్యాయంగా పలకరించడమే సేవకు అర్థమని తాను తెలుసుకోలేక పోయింది. ఇకనైనా తన ప్రవర్తన మార్చుకోవాలి. మామగారు ఇంటికి వచ్చిన తర్వాత ఆయనను ప్రేమగా, కన్న తండ్రిలా చూసుకోవాలి' అనుకుంది మనసులో.

మొత్తానికి పది రోజుల తర్వాత గండం గడిచి వెంకట్రావు క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంట్లో వాళ్ళందరూ ఆయన కోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఆత్రంగా ఎదురు చూసారు. ఇంటికి రాగానే ఆయనకు ఘన స్వాగతం లభించింది. పిల్లలయితే ఆయనను చుట్టుకుపోయారు. వెంకట్రావు ఆస్పత్రి నుంచి వచ్చి రెండునెలలు కావస్తోంది. ఇప్పుడు ఆయన ఎంతో ఉత్సాహంగా వుంటున్నాడు. ఇంతకు ముందులా ఒంటరితనంతో బాధపడటం లేదు. శైలజ పెందరాడే పనిపూర్తి చేసుకుని ఆయనతో కూర్చొని కబుర్లు చెపుతోంది. మామాకోడళ్ళు కలిసే భోంచేస్తున్నారు. మధ్యాహ్నం ఆయన పడుకునే సమయంలో మాత్రమే టీవీ చూస్తోంది శైలజ.

పిల్లలు స్కూలు నుంచి రాగానే ఆయన దగ్గరే వుంటున్నారు. అక్కడే చదువుకుంటూ తెలియనివి తాతయ్యని అడిగి తెలుసుకుంటున్నారు. శేఖర్ కూడా ఆఫీసు నుంచి వచ్చిన వెంటనే ఓ గంటసేపు తండ్రితో కబుర్లు చెబుతున్నాడు. రాత్రిపూట అందరూ కలిసే భోంచేస్తున్నారు. భోజనాల దగ్గర బాబీ, పాప ఎన్నో కబుర్లు, జోకులు చెప్పి నవ్విస్తుంటారు.

ఆదివారం వచ్చిందంటే చాలు... ఇంట్లో విందు భోజనమే. ఆ రోజు సాయంత్రం అందరూ సరదాగా షికారు వెళ్ళేవారు. ఒక రోజు సాయంత్రం శేఖర్ ఆఫీస్ నుంచి రాగానే "నాన్నగారూ! ఈ వేసవిలో అందరం దక్షిణదేశ యాత్రలకు వెళుతున్నాం. టిక్కెట్లు బుక్ చేసేశాను" అన్నాడు.

ఆ మాట వినగానే వెంకట్రావు ముఖం చిన్నబోయింది. అంటే ఓ పక్షం రోజులు మళ్ళీ తాను ఒంటరిగా ఉండాలన్న మాట. 'పోనీలే పిల్లల ఆనందం కంటే కావల్సిందేముంది' అనుకున్నాడు.

"తప్పకుండా వెళ్ళిరండి. నాకు ఒంట్లో బాగుండటం లేదు. పైగా దూరప్రయాణం చేయలేను" అన్నాడు.

"నాన్నగారూ మీ ఆరోగ్యానికి ఇప్పుడేం ఢోకా లేదు. అందరం సరదాగా వెళ్ళివద్దాం. మీరు రాకపోతే మేమూ వెళ్ళం" అని చెప్పాడు.

"కానీ శేఖర్! నాకు కళ్ళు సరిగా కనబడవు. నడవలేను ఎలా?" అన్నాడు. దానికి శేఖర్ పిల్లలవైపు 'ఏం చేద్దాం?' అన్నట్లు చూసాడు.

'మరేం ఫరవాలేదు నాన్నా! మనం ఊరెళ్ళేలోపు తాతయ్యని కళ్ళ డాక్టర్‌కి చూపిద్దాం. అప్పుడు తాతయ్య అన్నీ చూడగలడు' అన్నారు పిల్లలు.

"తాతయ్యా మీరు నడవలేకపోతే నేను మిమ్మల్ని ఎత్తుకుని తీసుకెళతాను" అన్నాడు బాబీ.

"నిజంగానా?"

"అవును తాతయ్యా" అన్నాడు బాబీ నవ్వుతూ. ఆ నవ్వుతో మిగతా వాళ్ళందరూ శ్రుతి కలిపారు. ●